క్లుప్తంగా

ఉపాధి పనుల తనిఖీ



మస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుబ్బరాజు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని చింతలాయిపల్లె సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఎంపీడీఓ సుబ్బరాజు తనిఖీ చేశారు. మస్టర్‌ను పరిశీలించి కూలీల హాజరును పరిశీలించారు. కూలీలకు పనులకు వచ్చిన సమయంలో మాత్రమే హాజరు వేయాలని ఈ సందర్భంగా ఎంపీడీఓ సిబ్బందికి సూచించారు. కూలీలలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏపీఓ గంగన్న,టీఏ చెన్నయ్య పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం



ఈఓకు నగదు అందజేస్తున్న దాత లక్ష్మీవెంకట మస్తాన్‌రావు

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయ అభివృద్ధికి బుధవారం గుంటూరు పట్టణానికి చెందిన లక్ష్మీవెంకటమస్తాన్‌రావు 1.16లక్షల విరాళాన్ని ఆలయ ఈఓ రామానుజన్, మాజీ ఆలయ చైర్మన్ పీఆర్ వెంకటేశ్వర రెడ్డికి అందజేశారు. దాతను సన్మానించి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. అమ్మవారి ఆలయ అభివృద్ధికి భక్తులు తమవంతు సహకారం అందజేయాలని ఈ సందర్భంగా ఈఓ కోరారు.

మద్యం, కల్లు దుకాణాల తనిఖీ



మద్యం బాక్స్‌లను పరిశీలిస్తున్న రవి కుమార్

బేతంచెర్ల: నంద్యాల జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి రవికుమార్ మండల కేంద్రం బేతంచెర్లతోపాటు బుగ్గానిపల్లె గ్రామంలోని కల్లు దుకాణాలను బుధవారం తనిఖీ చేశారు. కల్లును మినీకిట్ ద్వారా పరీక్షించి కల్తీ లేదని తెలిపారు. లైసెన్సులను పరిశీలించడంతో పాటు పరీక్షల నిమిత్తం కల్లు శాంపిల్స్ తీసుకున్నారు. అదేవిధంగా ఆర్ఎస్ రంగాపురం గ్రామంలోని మద్యం దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. బాండ్లు, స్టాకు, అమ్మకాల వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సబ్ ఇన్స్‌పెక్టర్ అస్లాంబేగ్, హెడ్ కానిస్టేబుల్ శివ నాగిరెడ్డి, సిబ్బంది కల్పన పాల్గొన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కొలిమిగుండ్ల: మండలంలోని అంకిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాలలో గురువారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. 1998 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు చాలారోజుల తర్వాత కలుసుకోనున్నారు. ఈసందర్భంగా అప్పట్లో విద్యను బోధించిన గురువులను సన్మానించనున్నట్లు తెలిపారు.


ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ



కామధేను ఫర్టిలైజర్స్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ రాజశేఖర్

ప్యాపిలి: పట్టణంలోని కామధేను, సౌజన్య, మల్లికార్జున, రాజేశ్ తదితర ఫర్టిలైజర్స్ దుకాణాలను బుధవారం ఏడీఏ రాజశేఖర్ తనిఖీ చేశారు. దుకాణాల్లో నిలువ ఉన్న మందులు, విత్తనాలను ఆయన పరిశీలించారు. అందుకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా లేని కారణంగా రూ. 1.47 లక్షలు విలువ స్టాక్‌పై విక్రయాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఏడీఏ తెలిపారు. అధిక ధరలకు విక్రయించినా, రైతులు కొనుగోలు చేసిన వాటికి రశీదు ఇవ్వకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి షేక్షావలి ఉన్నారు.

కంబలపాడు సర్కిల్‌లో నాలుగు రోజులుగా బైక్



నాలుగు రోజులుగా ఇక్కడే ఉన్న బజాజ్ బైక్

డోన్ రూరల్ : పట్టణంలోని కంబలపాడు సర్కిల్ గుమ్మకొండ ఆటో స్టాండ్ వద్ద నాలుగు రోజులుగా బజాజ్ బైక్(ఏపీ03వి9826) ఉండడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బైక్ వద్ద రాళ్లు, బండలు విరిగి ఉండడంతో పెద్దగొడవ జరిగినట్లు ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు. బైక్ ఇతర ప్రాంతానికి చెందిన వ్యక్తులది ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పత్తిరైతు ఆశలకు 'తామరపురుగు'

- పైరును ఆశించిన వైరస్
- పడిపోయిన దిగుబడులు... నష్టపోయిన రైతులు



తెగులు సోకి కాపులేక ఎర్రగా మారిన పత్తిపైరు

బనగానపల్లె : పత్తి రైతులను తామర పురుగు నష్టాల్లో ముంచేసింది. కనీసం పెట్టుబడులు కూడా రాకపోవడంతో రైతులు నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. గతంలో ఎన్నడులేని విధంగా హైబ్రిడ్–44 రకం పత్తిపంటకు తెగులు సోకడంతో పంట పూర్తిగా దెబ్బతినింది. పైరను కాపాడుకునేందుకు చేసిన ప్రయత్నాల్లో మరింత ఆర్థికంగా దెబ్బ తిన్నారు రైతులు. వ్యవసాయాధికారుల లెక్కల ప్రకారం బనగానపల్లె నియోజకవర్గంలో ఈ రకం పత్తి దాదాపు నాలుగువేల ఎకరాల్లో సాగు అయ్యింది. నల్లరేగడి నెలలు ఎక్కువగా ఉన్న బనగానపల్లె మండలంలో ఏకంగా రెండువేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. మొదటి విడతగా మే, జూన్ నెలల్లో, రెండవ విడతగా ఆగస్టు, సెప్టంబర్ నెలల్లో ఈ పంటను సాగు చేశారు. మొదటి విడత సాగు చేసిన పత్తి దిగుబడులు ఆశాజనకంగా ఉన్నప్పటికీ రెండవ విడతగా సాగు చేసిన సుమారు 2వేల ఎకరాలను తామర పురుగు చుట్టేసింది. మొదట్లో ఏపుగా పెరిగిన పైరును చూసి రైతులు సంతోషపడ్డారు. అయితే మారిన వాతావరణ పరిస్థితులు, వైరస్ రైతుల సంతోషాన్ని మింగేశాయి. పూత, పిందె దశలో తామర పురుగు వ్యాప్తితో పైరు ఎర్రబారింది. పిందె, ఆకులు ఎర్రగామారి నేలరాలాయి. దీంతో కనీసం దిగుబడులు కూడా రాక రైతులు తీవ్రంగా నష్టపోయారు.

పెరిగిన పెట్టుబడులు

సాధారణ సమయంలో పత్తిసాగు పెట్టుబడి ఎకరానికి రూ.30వేలకు మించదు. అయితే ఈయేడు తామర పురుగు వ్యాపించడంతో పెట్టుబడులు పెరిగిపోయాయి. వైరస్ నుంచి పత్తిపైరను కాపాడుకునేందుకు రైతులు విచ్చలవిడిగా క్రిమిసంహారక మందులు వాడడంతో పెట్టుబడి ఖర్చులు పెరిగాయి. ఎకరానికి రూ.40 వేలకుపైగా ఖర్చు చేసినట్లు రైతులు వాపోతున్నారు. ఎకరానికి 10–15 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా వైరస్ మూలంగా కనీసం క్వింటాం కూడా రాలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు రైతులు. సాగునీటి సౌకర్యం ఉన్న ప్రాంతాల్లో ఈ పంటను తొలగించి మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు.

పత్తిపైరును తొలగించాం



రెండు ఎకరాల్లో పత్తి పంటను సాగు. తెగులు సోకడంతో మందుల ఖర్చులు పెరిగాయి. ఎకరానికి దాదాపు రూ.50వేల వరకు పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. దిగుబడి ఏ మాత్రం రాలేదు. పత్తిపైరును తొలగించి ఇటివలే మొక్కజొన్న సాగు చేశా.

– ఎస్ మహేశ్వరరెడ్డి రైతు ఇల్లూరుకొత్తపేట

పెట్టుబడి కోల్పోయాం



నాలుగు ఎకరాల్లో పత్తి సాగు చేశా. గతంలో ఎన్నడులేని విధంగా ఈ సంవత్సరం సోకిన వైరస్ మూలంగా పంట దిగుబడి ఏమాత్రం లేదు. పెట్టుబడి కూడా రాలేదు. పంట నష్టాన్ని ప్రభుత్వం పరిశీలించి రైతులను ఆదుకోవాలి.

– ఎస్ వెంకటేశ్వర్లు,రైతు కాపులపల్లి

పత్తికి తామర పురుగు సోకింది



పత్తిని తామర పురుగు ఆశించడంతో పైరు దెబ్బతినింది. దీంతో రైతులు నష్టపోయారు. ఎక్కువగా రెండవ విడతసాగు చేసిన పత్తి రైతులకు నష్టం వాటిల్లింది. దిగుబడి లభించక పెట్టుబడి కూడా రాకపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయిన విషయం వాస్తవం.

– సుబ్బారెడ్డి, ఏఓ, బనగానపల్లె మండలం

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

- మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రాజేష్

డోన్ : పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ఈ ఏడాది ప్రాధాన్యత ఇస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశానికి కమిషనర్ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. రోడ్లు, డ్రైనేజీల సౌకర్యం కల్పించేందుకు పట్టణంలోని ప్రతివార్డుకు రూ. 20 లక్షలు చొప్పున 32 వార్డులకు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ తీర్మానాన్ని ప్రభుత్వానికి పంపుతున్నట్లు చైర్మన్ తెలిపారు. అదేవిధంగా పట్టణంలో ఇప్పటి వరకు చేపట్టిన వివిధ పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు రూ.56 లక్షలను చెల్లించేందుకు తీర్మానం చేశామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భాల్లో వచ్చిన ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఒక్కో సచివాలయానికి రూ.20లక్షలు కేటాయించేందుకు కూడా సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు.

వ్యర్థాల తరలింపు బాధ్యత ప్రైవేట్ ఏజెన్సీలకు

పట్టణంలో కోళ్ల ఫారాలు, చికెన్, మటన్‌షాపుల ద్వారా ప్రతిరోజు వెలువడుతున్న వ్యర్థాలను యజమాన్యాలు ఎక్కడపడితే అక్కడ వేస్తున్నారని చైర్మన్ సప్తశైల రాజేస్ అసంతృప్తి వ్యక్తం చేశారు. డ్రైనేజీలలో అత్యధికంగా కోళ్ల వ్యర్థాలు వేస్తుండడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుందని, ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. ఈ పరిస్థితిని సమీక్షించిన తర్వాత ఇకపై చికెన్, మటన్ షాపుల యజమానుల నుంచి వ్యర్థాలను సేకరించే పనులను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించినట్లు చైర్మన్ తెలిపారు. ఇందుకు ప్రతిఒక్కరూ సహకరించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని ఆయన కోరారు.

విచారణ అధికారిగా డోన్ ఆర్డీఓ

బనగానపల్లె : మండలంలోని జంబులదిన్నె, తమ్మడపల్లి, బనగానపల్లె టౌన్‌కు చెందిన దళిత కుటుంబాలకు 2018–19లో చేపట్టిన భూమి కొనుగోలు పథకం కింద జరిగిన అక్రమాలపై చర్యలకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఈ అక్రమాలపై విచారణ చేసేందుకు డోన్ ఆర్డీఓ వెంకటరెడ్డిని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ నియమించారని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసకుమార్ తెలిపారు. ఈ పథకం కింద అప్పట్లో భూమిలేని 39 మంది దళిత మహిళలను అధికారులు ఎంపిక చేశారు. ఒక్కొక్కరికి ఎకరం చొప్పున ప్రభుత్వం మంజూరు చేయగా బనగానపల్లెకు చెందిన రైతులు ప్రభాకర్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, నాగిరెడ్డి నుంచి 39 ఎకరాలను ఎస్సీ కార్పొరేషన్ కొనుగోలు చేసింది. ఈ మేరకు భూములకు సంబంధించిన మొత్తాన్ని ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రైతులకు చెల్లించారు అధికారులు. బనగానపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ కూడా జరిగింది. అయితే నాలుగేళ్లు అయినా లబ్ధిదారులైన దళిత మహిళకు భూమిని అప్పగించలేదు. దీంతో సమగ్ర విచారణ జరిపి దళిత మహిళలకు కేటాయించిన భూమిని సర్వే చేయించి న్యాయం చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు శ్రీనివాసకుమార్ తెలిపారు.

ఆర్‌బీకేల ద్వారా నానో ఎరువుల సరఫరా



మాట్లాడుతున్న ఏడీఏ కృష్ణమోహన్‌రెడ్డి

కోవెలకుంట్ల: రైతు భరోసా కేంద్రాల ద్వారా నానో ఎరువుల సరఫరాకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఏడీఏ కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డు రైతు విశ్రాంతి భవనంలో వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది, ఎరువుల కంపెనీ ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే రోజుల్లో ఆర్‌బీకేల నుంచి నానో యూరియా, డీఏపీ, తదితర ఎరువులను రైతులకు సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నిరంజన్, కంపెనీ ప్రతినిధులు జయచంద్ర, మధుబాబు పాల్గొన్నారు.

శనగ పైరును పరిశీలించిన మధ్యప్రదేశ్ శాస్త్రవేత్తలు



శనగ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కోవెలకుంట్ల: సంజామల మండలం పేరుసోముల గ్రామ సమీపంలో ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన ప్రత్యేక వంగడ రకమైన శనగ పైరును బుధవారం మధ్యప్రదేశ్ శాస్త్రవేత్తలు పరిశీలించారు. కోటపాడు గ్రామ రైతు వెంకటరామిరెడ్డి ఎస్ బీఈజీ776 రకానికి చెందిన శనగ పంటను సాగు చేశాడు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన శాస్త్రవేత్తలు అనిత, దినేష్, ఆర్కెసింగ్, నంద్యాల వ్యవసాయ పరిశోధనా శాస్త్రవేత్తలు జయలక్ష్మి, మంజునాథ్, రమాదేవి పైరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త రకమైన ఈ వంగడంతో పైరు ఏపుగా పెరిగి వాతావరణ పరిస్థితులను తట్టుకుని ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



వృద్ధురాలికి నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న చిక్కేపల్లి రామకృష్ణారెడ్డి

కోవెలకుంట్ల: స్థానిక ఎల్ఎం కాంపౌండ్‌కు చెందిన నిరుపేద వృద్ధురాలు చిన్నమ్మకు బుధవారం నిత్యావసర సరుకులు అందజేశారు. ఆరోగ్య సమస్యల నేపథ్యంలో వైద్యులు వృద్ధురాలి కుడికాలును ఇటీవల తొలగించారు. వృద్ధురాలి ఇబ్బందులను తెలుసుకున్న కర్నూలులో ట్రాన్స్‌కో ఏఈగా పనిచేస్తున్న కోవెలకుంట్లకు చెందిన చిక్కేపల్లి భార్గవి తనవంతుగా సాయం అందించారు. ఈ మేరకు ఏఈ తండ్రి, పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకుడు చిక్కేపల్లి రామకృష్ణారెడ్డి వృద్ధురాలి ఇంటి వద్ద వెళ్లి రూ.5 వేల విలువ బియ్యం, కందిపప్పు, చక్కెర, ఆయిల్ తదితర నిత్యావసర సరుకులతోపాటు వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 2 వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గజ్జెలరెడ్డి, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి



ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు



ఓబన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

కోవెలకుంట్ల: స్థానిక రోటరీక్లబ్ భవనంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం రేనాటిగడ్డకు చెందిన స్వాతంత్ర సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బ్రిటీష్‌వారిని గడగడలాడించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సర్వసైన్యాధిపతి అయిన ఓబన్న 216వ జయంతిని పురష్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు సుధాకర్, పల్లె నరసింహారెడ్డి, ఓబులేసు, వడ్డె సుబ్బరాయుడు దేశానికి స్వాతంత్రం సిద్ధింప చేసేందుకు వడ్డె ఓబన్న వీరోచిత పోరాటం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కరీంబాషా, అప్పపోగు వెంకటసుబ్బయ్య, అంజనేయులు, దిల్కుబాషా, నవీన్, మాబు, మురళీ, నరసింహ పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: రేనాటి వీరుడు వడ్డె ఓబన్న జయంతి వేడుకలను బుధవారం కొలిమిగుండ్లలో ఘనంగా జరుపుకున్నారు. వడ్డెర సంఘం ఆధ్వర్యంలో లలితా సుందరేశ్వరస్వామి ఆలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, కృష్ణమూర్తి, శ్రీరాం, రాజు, వెంకటసుబ్బయ్య, వెంకటేష్, శ్రీనివాసులు, మధు తదితరులు పాల్గొన్నారు.

అవుకు: రేనాటి వీరుడు వడ్డె ఓబన్న జయంతి వేడుకలను మండల పరిధిలోని రామాపురం వడ్డె వీధిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. వడ్డె ఓబన్న త్యాగాలను ఈసందర్భంగా వడ్డెర సంఘం అధ్యక్షుడు వడ్డె వెంకటపుల్లయ్య గుర్తు చేశారు. కార్యక్రమంలో రామ్మోహన్, రామాంజినేయులు, నాగరాజు, దస్తగిరి, వెంకటరాముడు, వెంకటేష్, గోపాల్, రమణ, అశోక్ పాల్గొన్నారు.

వడ్డె ఓబన్న ఆశయ సాధనకు కృషి చేయాలి

డోన్ టౌన్: స్వాతంత్ర సమరయోధుడు వడ్డె ఓబన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వడ్డెర హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి, డోన్ వడ్డెర సంఘం అధ్యక్షుడు నాగరాజు పిలుపునిచ్చారు. రేనాటి వీరుడు ఓబన్న 216వ జయంతిని పురష్కరించుకొని బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి ప్రధాన అనుచరుడిగా వడ్డె ఓబన్న స్వాతంత్ర పోరాటంలో బ్రిటీష్ పాలకుల చేతిలో ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం, బీసీ సంఘాల నాయకులు రామాంజనేయులు, రంగస్వామి, లక్ష్మీనారాయణ, బాలు, శివకుమార్, శ్రీనివాసులు, రామకృష్ణ, తిమ్మాపురం సురేష్, శేఖర్, ప్రకాష్ పాల్గొన్నారు.

బేతంచెర్ల: పట్టణంలోని వడ్డెర సంఘం కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న 216 జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లంకా సుబ్బరాయుడు, నాయకులు మరళీ, మధు, లాలప్ప తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

బేతంచెర్ల: పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు మూర్తుజావలీ, మండల నాయకులు బాబుల్ రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని బలపాలపల్లె గ్రామంలో ఎంపీడీఓ వెంగన్న, సర్పంచ్ చిన్న మద్దమ్మ, ఎంపీటీసీ మరియమ్మ , పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అమలవుతున్న సంక్షేమ పథకాలను, గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులను ఇంటింటికీ వెళ్లి ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు వివరించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలతో పాటు ఇంటింటికీ కోళాయి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరారు. అదేవిధంగా కొంత మందికి పీఎం కిసాన్ పడటం లేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పరిష్కార చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవతో రూ. 330 కోట్లతో చేపట్టిన గోరుకల్లు రిజర్వాయర్ వాటర్ గ్రిడ్ పథకం కింద ఇంటింటికీ కుళాయి మంజూరు చేస్తామని ఈ సందర్భంగా ఎంపీపీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు నారాయణ, వైస్ ఎంపీపీ రంగస్వామి, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు వైఎస్సార్ నాయకులు దస్తగిరి, గూని నాగరాజు, శేఖరయ్య, నాగేశ్వరరావు, ఎద్దులన్న, తిమ్మయ్య, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా కుడారై ఉత్సవం

డోన్: ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా స్థానిక వేంటేశ్వర ఆలయంలో భూదేవి, గోదాదేవి సమేతుడైన వెంకటేశ్వర స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశా రు. బుధవారం సాయంత్రం ఆలయ ఆవరణలో కుడారై ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి శంఖు చక్రాలకు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ, రాము శర్మ, ధర్మకర్తలు పాతాళం సుబ్బారావ్, శ్రీనివాసులు, రజనీకుమారిలు పాల్గొన్నారు.

మానవతా దృక్పథంతో బదిలీ

ప్యాపిలి: మండల పరిధిలోని సీతమ్మతండాలోని అంగన్‌వాడీ టీచర్ పుష్పను ఆమె కోరిక మేరకు మానవతా దృక్పథంతో హనుమంతరాయుని పల్లెకు బదిలీ చేసినట్లు సీడీపీఓ షంషాద్ బేగం మంగళవారం ఒక ప్రకటలో తెలిపారు. రాజకీయ ఒత్తిళ్లతోనే పుష్పను బదిలీ చేశామని పత్రికల్లో వచ్చిన వార్తలను ఆమె ఖండించారు. తన భర్త వేధింపుల కారణంగా తాను సీతమ్మ తండాలో ఉద్యోగం చేసుకోలేకపోతున్నట్లు పుష్ప లిఖితపూర్వకంగా కోరారన్నారు. ఈ మేరకు గత నవంబర్‌లో ఆమెను బదిలీ చేశామన్నారు. అయితే హనుమంతరాయుని పల్లె ప్రజలు మరొక గ్రామం నుంచి వచ్చిన అంగన్ వాడీ టీచర్ అవసరం లేదని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో పుష్పను తిరిగి సీతమ్మతండాకు బదిలీ చేయాల్సివచ్చిందన్నారు. అప్పటి నుంచి ఆమె సీతమ్మతండాలో విధుల్లో చేరకుండా ప్రజాసంఘాలతో కలిసి ధర్నాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లతోనే తనను తిరిగి సీతమ్మతండాకు బదిలీ చేసినట్లు ఆరోపిస్తోందన్నారు. ఇప్పటికైనా పుష్ప వెంటనే సీతమ్మతండాలో విధుల్లో చేరాలని, లేకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సీడీపీఓ స్పష్టం చేశారు.

మట్కా బీటర్ అరెస్టు

డోన్ రూరల్ : స్థానిక శ్రీనివాసనగర్ కాలనీకి చెందిన మట్కాబీటర్ ఈడిగ శివకుమార్‌ను బుధవారం అరెస్టు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. కాలనీలో మట్కా రాస్తున్నాడనే సమాచారం మేరకు దాడి చేసి రూ. 5,400 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

రహిమాను పురంలో డెంగీ

బేతంచెర్ల: మండల పరిధిలోని రహిమానుపురంలో జ్వరం లక్షణాలతో బాధపడుతున్న బారికొల్ల మద్దిలేటి ఎనిమిదేళ్ల చిన్నారిని కర్నూలుకు తీసుకెళ్లగా డెంగీ లక్షణాలు కనిపించాయి. కార్యదర్శి రంగస్వామి, సర్పంచ్ ప్రమీలమ్మ అప్రమత్తమయ్యారు. బుధవారం గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేయించారు. పరిసరాల పరిశుభ్రతపై వలంటీర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

మహాసభలు జయప్రదం చేయండి



జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: బెంగళూరులో ఈ నెల 18వ నుంచి 22వ తేదీ వరకు జరిగే సీఐటీయూ ఆల్ ఇండియా మహాసభలకు కార్మికులు, ఉద్యోగులు, కర్షకులు తరలివచ్చి విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక మోటార్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద మహా సభలను పురష్కరించుకుని బుధవారం సీనియర్ నాయకుడు కొండన్న చేతుల మీదుగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకుడు శివరాం మాట్లాడుతూ హక్కుల సాధనకు కార్మికులు ఐకమత్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, నక్కి శ్రీకాంత్, నాగన్న, లక్ష్మన్న, ఆదినారాయణరెడ్డి, విజయ్, హరి, అబీబ్, బాషా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయ నూతన భవనాన్ని పరిశీలించిన డీఈఈ

బనగానపల్లెరూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రూ.90లక్షలతో నిర్మిస్తూ అసంపూర్తిగా నిలిచిపోయిన నూతన భవనాన్ని బుధవారం కోవెకుంట్ల ఆర్అండ్‌బీ డీఈఈ సునీల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ భవన నిర్మాణ పనులు సుమారు 95 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. కొన్నేళ్లుగా భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయని, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆదేశాల మేరకు పరిశీలించేందుకు వచ్చామన్నారు. ఈ నెల చివరిలోపు నిర్మాణ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

చురుగ్గా సాగుతున్న రామళ్లకోట రోడ్డు పనులు



తారు రోడ్డు పనులు జరుగుతున్న దృశ్యం

బేతంచెర్ల: మండల కేంద్రమైన బేతంచెర్ల నుంచి వెల్దుర్తి మండలం రామళ్ల కోట వరకు 22 కిలోమీటర్ల మేర చేపట్టిన డబుల్‌రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణానికి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరువతో రూ. 42 కోట్లు మంజూరైన విషయం తెలసింది. డబుల్ రహదారి పనుల్లో భాగంగా బేతంచెర్ల నుంచి కొలుములపల్లె వరకు గ్రావెల్ రోడ్డు పూర్తి కావడంతో తారు రోడ్డు పనులు చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం తారు రోడ్డు పనులను ఆర్అండ్‌బీ ఈఈ సురేష్ బాబు, ఏఈ మునిస్వామి పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కంట్రాక్టర్‌కు సూచించారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు



ముగ్గులు వేస్తున్న విద్యార్థు

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్ల మోడల్ స్కూల్‌లో బుధవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ చంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల, కళాశాల విద్యార్థినులకు రంగ వల్లుల పోటీలు నిర్వహించారు. అధ్యాపకులు సంప్రదాయ దుస్తులు ధరించి భోగి మంటలు వేసి ప్రదక్షణలు చేశారు. ముగ్గుల పోటీల్లో ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాముడు, అధ్యాపకులు చారిస్, శివలింగారెడ్డి, మధుసూదన్, ప్రసాద్, ప్రశాంతి,స్వాతి, వరలక్ష్మి,చంద్రకళ,స్వప్న పాల్గొన్నారు.

బేతంచెర్ల: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ముందస్తు సంక్రాంతి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలలో విద్యార్థులు సంప్రదాయ వస్త్రాధారణలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శ్రీనారాయణ, భాగ్యోదయ ఉన్నత పాఠశాల్లో రంగు రంగుల ముగ్గులు వేశారు. గొబ్బెమ్మలు, భోగి మంటలు ఏర్పాటు చేసి పాటలు పాడుతూ సంక్రాంతి సంబరాలు చేసుకున్నారు.

డోన్ టౌన్: పట్టణంలోని పలు ప్రైవేట్ స్కూళ్లలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంక్రాంతి ప్రాముఖ్యతను ఆయా స్కూళ్ల ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. అనంతరం పిల్లలకు రేగు పళ్లు పోస్తూ సుఖంగా జీవించాలని దీవించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.